క్లుప్తంగా

నేడు ఒలింపిక్ రన్

తుని: స్థానిక రాజా కళాశాల మైదానంలో శుక్రవారం ఉదయం 8.30 గంటలకు అంతర్జాతీయ ఒలింపిక్ రన్‌ను ప్రారంభించనున్నట్టు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిదిండి సత్యనారాయణ రాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తుని పట్టణం, పరిసర ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు, విద్యార్థులు రన్‌లో పాల్గొనాలని ఆయన కోరారు.

ఎరువుల దుకాణాలపై దాడులు



ఏలేశ్వరంలోని ఎరువుల షాపులో రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

ఏలేశ్వరం: మండలంలోని పలు ఎరువుల దుకాణాలపై శుక్రవారం వ్యవసాయశాఖ అధికారులు దాడులు నిర్వహించారు. వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ హరి నేతృత్వంలో ఏలేశ్వరం, లింగంపర్తి గ్రామాల్లోని ఎరువుల దుకాణాలపై దాడులు నిర్వహించి రికార్డులను తనిఖీ చేశారు. షాపుల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. నిబంధనల ప్రకారం షాపుల్లో ఎరువుల నిల్వలు, రికార్డులు సక్రమంగా ఉండాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏలేశ్వరం, పెద్దాపురం ఏఓలు జ్యోతి, సంజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

ఏలేశ్వరం: విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ పట్టణంలో గురువారం వామపక్షాల నేతలు ఆందోళన నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి పాకలపాటి సోమరాజు, సీపీఐ (ఎంఎల్)లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏనుగుపాటి అర్జునరావు ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ చౌక్, ట్రాన్స్‌కో కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. పెంచిన విద్యుత్‌చార్జీలను వెంటనే తగ్గించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో వేమగిరి దొంగబాబు, పెదపాటి నాని, శీలు బాలమ్మ, ఖండవిల్లి చినరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు రేషన్ డీలర్ల ఆత్మీయ సమావేశం

తుని: స్థానిక పొగాకు వర్తక సంఘం భవనంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు రేషన్ డీలర్ల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్టు ఆ సంఘ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పోలిశెట్టి శివకేశ్వరరావు గురువారం తెలిపారు. ఐదు మండలాలకు చెందిన డీలర్లతో నిర్వహించే ఈ సమావేశానికి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వెంకటరావు, జిల్లా అధ్యక్షుడు రవికుమార్ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. రేషన్ డీలర్లు తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన కోరారు.

ఎంఈఓ-2గా అచ్చిరాజు



ప్రత్తిపాడు: మండల విద్యాశాఖాధికారి-2గా వై.అచ్చిరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. తొండంగి మండలం ఏవీ నగరం జెడ్పీ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న అచ్చిరాజు పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఎంఈఓ-2గా బాధ్యతలు స్వీకరించిన అచ్చిరాజును ఎంఈఓ వి.రాజబాబు, సీఆర్పీలు రాంజీ, అప్పన్న, మల్లేష్, బాషా, గంగరాజు, విద్యాశాఖ సిబ్బంది అభినందించారు.

గోకవరం తహసీల్దార్‌గా సుగుణ



గోకవరం: మండల తహసీల్దార్‌గా డి.సుగుణ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆమె కిర్లంపూడి, ప్రత్తిపాడు మండలాల ఎంఎస్‌ఓగా బాధ్యతలు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. రెవెన్యూ సిబ్బంది, మండలంలోని పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు ఆమెకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలు అందిస్తానన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

క్రిస్టియన్ మైనార్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జిగా జాన్ వెస్లీ



కాకినాడలో జాన్ వెస్లీని సత్కరిస్తున్న పాస్టర్స్ అసోసియేషన్ నేతలు

జగ్గంపేట: మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు జాన్ వెస్లీ వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్టు ఆయన తెలిపారు. తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, పార్టీ జోనల్ కో ఆర్డినేటర్ మిధున్‌రెడ్డి, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షుడు విజయసాయిరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాగా కాకినాడలో జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు జాన్ వెస్లీని ఘనంగా సత్కరించారు.

చెత్త సమస్యకు మోక్షం

- తుని పట్టణానికి తొమ్మిది ఈ-వాహనాల మంజూరు
- సిబ్బందిపై తగ్గనున్న భారం
- ప్రజలు సహకరిస్తే వ్యర్థరహితంగా పట్టణం



తునికి కేటాయించిన ఎలక్ట్రికల్ వాహనాలు

తుని: పట్టణ ప్రజలను ఎన్నో ఏళ్లుగా పట్టి పీడిస్తున్న చెత్త (వ్యర్థాలు, పారిశుధ్యం) సమస్యకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపింది. క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా తడి, పొడి చెత్త సేకరణకు తొమ్మిది ఈ-వాహనాలను మంజూరు చేసింది. ఇటీవల మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి వీటిని ప్రారంభించారు. పట్టణ పరిధిలో 30 వార్డులు ఉన్నాయి. ప్రస్తుతం పారిశుధ్య కార్మికులు ఆయా వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ చేస్తున్నారు. మరి కొందరు రోడ్లపై వేసిన వ్యర్థాలను సేకరిస్తున్నారు. ఇకపై ప్రతి ఐదు వార్డులకు ఈ-ఆటోను కేటాయించారు. ప్రజలు తమ ఇళ్లలోని వ్యర్థాలను తడి, పొడి చెత్తలుగా వేరు చేసి వీధిలోకి వచ్చిన వాహనంలో ఏర్పాటు చేసిన బాక్సుల్లో వేస్తే చాలు చెత్త సేకరణ కేంద్రాలకు నేరుగా చేరతాయి. గతంలో పది మంది కార్మికులు చేసే పనిని ప్రస్తుతం ఒక వాహనం చేస్తుంది. పట్టణ ప్రజలు సహకరిస్తే అతి త్వరలోనే పట్టణాన్ని వ్యర్థ రహితంగా తీర్చిదిద్దవచ్చు.

రోజుకు 39 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు

తుని మున్సిపాలిటీ గ్రేడు-2 పురపాలకసంఘంగా ఉంది. 30 వార్డుల పరిధిలో సుమారు 60 వేల మంది జనాభా ఉన్నారు. 14 వేల కుటుంబాలు ఉన్నాయి. ఇతర ప్రాంతాల నుంచి రోజుకు 20 వేల మంది పట్టణానికి వివిధ పనులపై వస్తుంటారు. ఇటీవల సముద్రతీర ప్రాంతంలో మందుల పరిశ్రమలు రావడంతో ఉద్యోగులు నివాసం కోసం 50 అపార్ట్‌మెంట్లు వచ్చాయి. వీటిలో 800 కుటుంబాలు ఉంటున్నాయి. దీంతో రోజుకు 39 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు వస్తున్నాయి. వీటిని డంపింగ్ చేయడానికి అవసరమైన యంత్రాలు ప్రస్తుతం అందుబాటులోకి వచ్చాయి. దీంతో పారిశుధ్య సిబ్బంది కొరత సమస్యకు పరిష్కారం లభించనుంది. ఇకపై సేకరించిన చెత్తలో 80 శాతం మేర సంపద సృష్టి కేంద్రాలకు నేరుగా తరలిస్తారు. దీంతో కంపోస్టు తయారీకి అవసరమైన ముడి సరకు అందుబాటులోకి వస్తుంది.



సేకరించిన చెత్తను కంపోస్టు తయారీ కోసం ట్రెంచ్‌లో వేస్తున్న దృశ్యం

> **ఉన్నతాధికారులకు నివేదిక పంపాం**
>
> 
>
> పురపాలక సంఘం పరిధిలో పారిశుధ్య కార్మికుల కొరత లేకుండా భర్తీ చేయాలని డీఎంఏకు నివేదిక పంపాం. కొత్త వాహనాలు, డంపర్ బిన్నులు కొనుగోలు చేయాల్సి ఉంది. తుని పట్టణానికి ప్రభుత్వం కొత్తగా తొమ్మిది ఈ-వాహనాలను కేటాయించింది. వీటితో చెత్త సేకరణ సులభతరమైంది.
>
> -ప్రసాదరాజు, కమిషనర్, తుని

సిబ్బంది కొరతకు పరిష్కారం

పురపాలక సంఘం నిబంధనల ప్రకారం 1200 మంది జనాభాకు నలుగురు పారిశుధ్య కార్మికులు ఉండాలి. వీరిలో ఇద్దరు రోడ్లపై వ్యర్థాలు సేకరిస్తే, మరో ఇద్దరు కాలవలు శుభ్రం చేయుట, చెత్తను ఎత్తి వాహనాల్లో వేయడానికి ఉపయోగిస్తారు. ఇకపై ఈ వాహనాలతో సిబ్బంది సమస్య అంతగా ఉండదని అధికారులు చెబుతున్నారు.

రైతులకు వరి విత్తనాల పంపిణీ



రౌతులపూడిలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న భాస్కరబాబు

రౌతులపూడి: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో అన్ని రైతు భరోసా కేంద్రాల్లోనూ రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు ఆధ్వర్యంలో గురువారం రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. విత్తనాలను రైతు భరోసా కేంద్రాల్లో మొలకకట్టి రైతులకు అందజేస్తున్నట్టు తెలిపారు. రైతులు ఈ విత్తనాలను వేసే ముందు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుండబోలు దివాణం, గొల్లు వెంకటరమణ, ఏఈఓ సీహెచ్ గోపీనాథ్, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుని: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పట్టణ పరిధిలోని ఒకటి నుంచి 10 వార్డుల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఈఈ కె.రత్నాలరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కోటనందూరు ఫీడర్, తాండవ సబ్‌స్టేషన్, కత్రాళ్లకొండ, సీతారాపురం ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా పట్టణ పరిధిలోని కొండవారిపేట, టైలర్స్ కాలనీ, అమ్మాజీపేట, సీతారాంపురం, కంకిపాటి వారి గరువు, శ్రీనివాసా సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్స్, రెల్లికాలనీ, డ్రైవర్స్ కాలనీలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని ఆయన కోరారు.

పేదలకు 25 శాతం సీట్లు కేటాయించాలి

జగ్గంపేట: కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో పేదలకు 25 శాతం సీట్లు ఉచితంగా ఇవ్వాలనే ప్రభుత్వ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదని పీడీఎస్‌యూ నాయకులు ఆరోపించారు. సీట్ల కేటాయింపులో కార్పొరేట్, ప్రైవేట్ స్కూల్స్ అవలంబిస్తున్న తీరుపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జగ్గంపేట ఎంఈఓ ఆర్.స్వామికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పీడీఎస్‌యూ ప్రధాన కార్యదర్శి కడితి సతీష్ మాట్లాడుతూ కొన్ని పాఠశాలల్లో యూనిఫాం, పుస్తకాలు పేరు చెప్పి పిల్లల నుంచి రూ.15 వేలు వసూలు చేస్తున్నారని తెలిపారు. జగ్గంపేట పరిధిలోని ప్రైవేట్ స్కూళ్లలో ఎంతమందికి ఉచితంగా సీట్లు కేటాయించారో విచారణ జరపాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

తొండంగి: యువత సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని తొండంగి ఎస్సై ఎస్.రవికుమార్ సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మురలయ్యపేటలో గురువారం రాత్రి వారధి కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలపై వీడియో ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ చాటింగ్ ద్వారా బ్యాంకు అకౌంట్ల నుంచి నగదు తస్కరించడం, స్త్రీలపై లైంగిక దాడులు, మాదక ద్రవ్యాల నివారణ, రహదారి భద్రత, శాంతి భద్రతల రక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌సీ శ్రీనివాసరావు, మహిళా పోలీస్ వరలక్ష్మి, శ్రీను, పాముర్రాజు తదితరులు పాల్గొన్నారు.

10 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) పరిధిలోని గ్రామాల్లో దాడులు నిర్వహించి పది లీటర్ల సారాతో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్‌ఈబీ సీఐ పి.అశోక్ గురువారం తెలిపారు. కిర్లంపూడి మండలం సోమవరంలో వీధి చిన్నోడు అలియాస్ దాసును అరెస్టు చేసి, అతని నుంచి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రత్తిపాడు మండలం చింతలూరులో సారా స్థావరంపై దాడి చేసి, సారా తయారీకి సిద్ధం చేసిన 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. ఈ కేసులో అదే గ్రామానికి చెందిన నిందితుడు వాసంశెట్టి శ్రీను పరారైనట్టు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ద్విచక్రవాహనం చోరీపై కేసు

గండేపల్లి: ద్విచక్ర వాహనం చోరీపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై వై.గణేష్ కుమార్ గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని ఉప్పలపాడుకు చెందిన అయినాల రవికుమార్ ఈ నెల 15న నీలాద్రిరావు పేటలోని వీరమ్మ పేరంటాలు అమ్మవారి ఆలయం వద్ద తన మోటార్ సైకిల్‌ను పార్కింగ్ చేసి ఎలక్ట్రికల్ పనికి వెళ్లాడు. పని ముగించుకుని వచ్చే సరికి మోటార్ సైకిల్ కనబడలేదు. ఆచూకీ కోసం పలుచోట్ల వెతికినప్పటికీ దొరకకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

జగ్గంపేట: గ్రామ శివారు పోలవరం గట్టు సమీపంలో పేకాట శిబిరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.2800 స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎస్సై విద్యాసాగర్ తెలిపారు.

రూ.కోటితో కైలాసభూమి నిర్మాణం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- రూ.4 లక్షల విరాళం ప్రకటన

అన్నవరం: గ్రామంలో రూ.కోటితో కైలాసభూమి (హిందూ శ్మశానవాటిక) నిర్మించనున్నట్టు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ తెలిపారు. స్థానిక సత్యగణపతి వర్తకసంఘం కల్యాణ మండపంలో గురువారం సర్పంచ్ ఎస్.కుమార్ రాజా అధ్యక్షత శ్మశానవాటిక నిర్మాణంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్తుల కోరిక మేరకు గత మూడేళ్లుగా శ్మశానవాటికకు స్థలం కోసం ప్రయత్నాలు చేశామన్నారు. చివరకు సర్వే నంబర్ 76లో దాత జంపన కేశవరాజుకు చెందిన 1.20 ఎకరాల స్థలాన్ని శ్మశానవాటికకు కేటాయించినట్టు తెలిపారు. ఈ స్థలంలో ఎంపీ గ్రాంట్, ఎమ్మెల్యే గ్రాంట్, మండల పరిషత్, పంచాయతీ నిధులతో పాటు గ్రామస్తుల విరాళాలతో శ్మశానవాటిక నిర్మిస్తామని తెలిపారు. అలాగే దాతలతో మాట్లాడి మృతదేహాలను శ్మశానవాటికకు తరలించేందుకు కైలాసరథం కూడా సమకూర్చుతానని చెప్పారు. శ్మశానవాటిక నిర్మాణానికి ఎమ్మెల్యే రూ.4 లక్షల విరాళాన్ని ప్రకటించారు.

వ్రతపురోహిత సంఘం రూ.10 లక్షల విరాళం

శ్మశానవాటిక నిర్మాణానికి అన్నవరం దేవస్థానం వ్రతపురోహిత సంఘం రూ.10 లక్షలు విరాళం ప్రకటించింది. ఈ మేరకు సంఘ గౌరవాధ్యక్షుడు నాగాభట్ల కామేశ్వరశర్మ సమావేశంలో ప్రకటించారు. సత్యదేవ బ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రం అధ్యక్షుడి హోదాలో రూ.1,01,116 విరాళాన్ని కామేశ్వరశర్మ ప్రకటించారు. మాజీ ఉపసర్పంచ్ పెద్దింటి నారాయణరావు తన వంతుగా శ్మశానవాటికలో ఒక శవదహన బెడ్ నిర్మాణానికి విరాళాన్ని ప్రకటించారు. సమావేశంలో శంఖవరం ఎంపీపీ పర్వత రాజబాబు, వైస్ ఎంపీపీ ధారా వేంకటరమణ, రోటరీ క్లబ్ అధ్యక్షుడు రమణమూర్తి, వెంకట్, పెన్షనర్స్ సంఘ అధ్యక్షుడు కందర్ప సత్యనారాయణ మూర్తి, అన్నవరం ఉపసర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లగుడు శ్రీనివాసు

కోటనందూరు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. మండలంలోని బిళ్లనందూరులో గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లకు గురువారం జగనన్న సురక్ష పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వివిధ కారణాలతో పథకాలు నిలిచిపోయిన వారి వివరాలు సేకరించాలన్నారు. సంక్షేమ పథకాల అమలుకు అవసరమైన ధ్రువపత్రాలను ప్రభుత్వం ఉచితంగా మంజూరు చేస్తుందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయాలి

తుని రూరల్: జూలై ఒకటి నుంచి ప్రారంభమయ్యే జగనన్న సురక్ష పథకాన్ని విజయవంతం చేయాలని మార్కెట్ కమిటీ డైరెక్టర్ అన్నంరెడ్డి వీరరాఘవులు కోరారు. మండలంలోని కేఓ మల్లవరంలో గురువారం పంచాయతీ కార్యదర్శి పైల శివ అధ్యక్షతన జగనన్న సురక్ష పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీరరాఘవులు మాట్లాడుతూ జగనన్న సురక్షలో భాగంగా ఇంటి వద్దకే అధికారులు వచ్చి వివిధ రకాల ధ్రువపత్రాలు అందిస్తారన్నారు. ఈ పత్రాలను అర్హులైన వారందరికీ ఇచ్చేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు డొంక వెంకట బెనర్జీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ



చైతన్య దర్శన్



కోట ప్రజ్వల్ కుమార్



పవన్‌కుమార్



జ్ఞానశశిధర్

ప్రత్తిపాడు రూరల్: నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని అఖిల్ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఇనకోటి గంగాధర్ గురువారం తెలిపారు. జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2023-24 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశానికి ఇటీవల పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో తమ వద్ద కోచింగ్ తీసుకున్న విద్యార్థులు చైతన్య దర్శన్, కోట ప్రజ్వల్ కుమార్ ప్రతిభ చూపి నవోదయకు ఎంపికయ్యారని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సంస్థ కరస్పాండెంట్ ఇనకోటి గంగాధర్, ఏఓ సత్యనారాయణ, ఇన్‌చార్జ్ లత, ఇతర ఉపాధ్యాయులు అభినందించి సత్కరించారు.

కోటనందూరు: నవోదయ ఆరో తరగతి ప్రవేశ పరీక్షలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. స్థానిక ఎంపీపీ పాఠశాల విద్యార్థి సంబారు జ్ఞానశశిధర్, కేఏ మల్లవరం ఎంపీయూపీ పాఠశాలకు చెందిన గాడి పవన్‌కుమార్ ఉత్తమ ప్రతిభ కనబరిచి సీట్లు సాధించారు. వీరిద్దరూ స్థానిక ఏవీఎం కోచింగ్ సెంటర్లో కోచింగ్ తీసుకున్నారు. ఎంపికైన విద్యార్థులు ఎటపాక నవోదయలో 6వ తరగతిలో చేరనున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపీపీ లగుడు శ్రీనివాసు, పాఠశాల ఉపాధ్యాయులు, ఏవీఎం కోచింగ్ సెంటర్ అధినేత విష్ణుమూర్తి తదితరులు అభినందించారు.

రహదారి నిర్మాణ పనులకు శ్రీకారం



తునిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి

తుని: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిని రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. స్థానిక 30వ వార్డులో కౌన్సిలర్ సిద్ధిరెడ్డి గౌరీవనజ ఆధ్వర్యంలో రూ.10 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను గురువారం చైర్‌పర్సన్ సుధారాణి ప్రారంభించారు. మార్కండ్రాజుపేట సమతా గ్యాస్ ఏజెన్సీ వీధిలో ప్రజల అభ్యర్థన మేరకు సీసీ రోడ్డును నిర్మిస్తున్నామన్నారు. గత పాలకులు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంలో విఫలమయ్యారన్నారు. తమ పాలక వర్గంలో మంత్రి దాడిశెట్టి రాజా సహకారంతో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను, కమిషనర్ ప్రసాదరాజు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

పోరాటాల ఫలితంగానే సత్రం భూములకు కౌలు వేలం

గోకవరం: రంపయర్రంపాలెంలో సుందరమ్మ సత్రం భూములపై ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం చేసిన పోరాటాల ఫలితంగానే అధికారులు ఆ భూములకు కౌలు వేలం నిర్వహిస్తున్నారని రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. మండలంలోని రంపయర్రంపాలెంలో గురువారం ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా సత్రం భూములను పలువురు తమ ఆధీనంలో ఉంచుకుని అనుభవిస్తున్నారన్నారు. దీనిపై రెండు దశాబ్దాలుగా రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో అలుపెరగని పోరాటం చేశామన్నారు. దీని ఫలితంగా ఈ నెల 27న భూములకు కౌలు వేలం నిర్వహిస్తామని అధికారులు ప్రకటించారన్నారు. ఈ వేలం పాటల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

డ్రగ్స్ నివారణపై అవగాహన ర్యాలీ

గోకవరం: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరుకొండ ఎస్‌ఈబీ ఎస్సై సత్యనారాయణ సూచించారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా గురువారం గోకవరం కేవీఎస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలకు బానిసలు కాకూడదని, చదువుకుని మంచి ఉన్నత స్థానాల్లో ఉండాలన్నారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్టు సమాచారం ఉంటే తమకు సమాచారం అందించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, ఎస్‌ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

శంఖవరం: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై అవగాహన పెంచుకోవాలని ప్రత్తిపాడు సీఐ కిషోర్‌బాబు సూచించారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో గురువారం విద్యార్థులకు డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలు తీసుకున్న కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. గ్రామాల్లో మాదక ద్రవ్యాలు వినియోగం జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అన్నవరం ఎస్సై అజయ్‌బాబు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



శంఖవరం అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ అజయ్‌బాబు

రాజేష్‌కు 'ముద్రగడ'ను విమర్శించే స్థాయి లేదు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న చిట్టిబాబు

కిర్లంపూడి: మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఇటీవల పవన్‌కల్యాణ్‌కు రాసిన బహిరంగ లేఖపై మహాసేన రాజేష్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని జిల్లా మాల మహానాడు నాయకుడు మర్రా చిట్టిబాబు అన్నారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం దళిత నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే, మంత్రి, ఎంపీ ఇలా ఎన్నో పదవులు చేపట్టి ప్రజలకు సేవ చేసిన సీనియర్ నాయకుడు ముద్రగడ పద్మనాభం అన్నారు. కాపుల వీధిలో అంబేడ్కర్ విగ్రహం పెట్టి అన్ని కులాలను ఒకేలా చూసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అలాంటి నాయకుడుపై వ్యంగ్యంగా మాట్లాడడం సరికాదన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు బంగారు రమణ, గెడ్డం అప్పన్న, మర్రా చంటిబాబు, బులిపే గోపి, మూరా రాజ్‌కుమార్, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం



తంటికొండలో విద్యార్థినికి ప్రశంసా పత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని సచివాలయాల మండల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు అన్నారు. మండలంలోని తంటికొండ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి చేస్తున్న కృషి ఫలితంగా ఈ ఏడాది పదో తరగతిలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, బద్దిరెడ్డి అప్పన్నదొర, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బద్దిరెడ్డి నాగవెంకటేశ్వరరావు, పీఏంసీ చైర్మన్ బద్దిరెడ్డి దామోదర్, బద్దిరెడ్డి సుబ్బారాయుడు, బద్దిరెడ్డి నాగసూర్యసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు



గౌరంపేటలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

శంఖవరం: రైతులు భూసార పరీక్షలు చేయించుకుని, దానికి అనువైన పంటలు వేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ సూచించారు. మండలంలోని గౌరంపేటలో గురువారం భూసార పరీక్షలకు మట్టి నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఇప్పటివరకూ 260 మట్టి నమూనాలు సేకరించామన్నారు. భూసార పరీక్షల అనంతరం రైతులు ఆయా భూముల్లో ఏయే పంటలు వేయాలో తెలియజేస్తామన్నారు. భూసార పరీక్షలు చేయించుకోవడానికి ఆసక్తి ఉన్న రైతులు ఈ నెలాఖరులోగా గ్రామాల్లోని వీపీఏలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్న పాలవెల్లువ'పై అవగాహన

రౌతులపూడి: జగనన్న పాలవెల్లువ పథకంతో పాడి రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని మండల పశుసంవర్థకశాఖ అధికారి ఎం.వీర్రాఘవరావు అన్నారు. మండలంలోని లచ్చిరెడ్డిపాలెం, ఎస్ఎస్ పట్నం గ్రామాల్లో గురువారం జగనన్న పాలవెల్లువపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పాడి రైతులకు ఎన్నో సంక్షేమ పథకాలు, రాయితీలు కల్పిస్తున్నట్టు తెలిపారు. రైతులు పాలవెల్లువ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ వైస్ ప్రెసిడెంట్ సూరెడ్డి సాయి, సర్పంచులు సింగంపల్లి వెంకటలక్ష్మి, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.